ప్రజాశక్తి
సోమవారం 23 అక్టోబర్ 2023 5 కర్నూలు

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర్ రెడ్డి

దసరాకు ధరాఘాతం

- పెరిగిన ధరలతో సామాన్యుల బెంబేలు - పండగ పూట బక్ష భోజనం కష్టమే

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

దసరాకు సామాన్యులకు ధరాఘాతం తప్పడం లేదు. పెరిగిన ధరలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పండగ పూట బక్ష భోజనం కష్టంగా మారింది. చాలామంది ఉన్న దాంట్లోనే సర్దుకుని పండగను చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది...

సామాన్యులకు దసరాకు ధరాఘాతం తప్పడం లేదు. దసరా సందర్భంగా జిల్లాలో చాలా మంది బక్షాలను చేసుకుంటారు. నిత్యావసర ధరలకు రెక్కలు రావడంతో సామాన్యులకు పండగ పూట బక్ష భోజనం కష్టంగా మారనుంది. బక్షాలకు ప్రధానంగా నూనె, బెల్లం, శనగలు, మైదాను ఉపయోగిస్తారు. లీటర్ పామాయిల్ ప్యాకెట్ రూ.120, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.140 నుంచి రూ.170 వరకూ పలుకుతోంది. ఇతర సరుకుల ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. కర్నూలు నగరంలో కిలో శనగ బ్యాళ్లు మొదటి రకం బెల్లం రూ.80, రెండో రకం బెల్లం రూ.70గా ఉన్నాయి. ఆదోనిలో గత ఏడాది కందిపప్పు రూ.120 ఉండగా ప్రస్తుతం రూ.170 ఉంది. సనప్లవర్ ఆయిల్ గత ఏడాది రూ.100 ఉండగా ప్రస్తుతం రూ.150, వేరుశనగ విత్తనాలు గతంలో రూ.80 ఉండగా రూ.120, ఎండు మిరపకాయలు రూ.100 ఉండగా ప్రస్తుతం రూ.130, బెల్లం గతంలో రూ.30 ఉండగా ప్రస్తుతం రూ. 55, శనగపప్పు గతంలో రూ. 60 ఉండగా ప్రస్తుతం రూ.80 ఉన్నాయి. వీటికి తోడు పెట్రోలు డీజల్, గ్యాస్ అను నిత్యం పెరగడం వల్ల వీటి ప్రభావం నిత్యావసరాలపై పడి పేదప్రజల జీవితాలు కడు దుర్భరంగా మారాయి. నందికొట్కూరులో కిలో శనగ బ్యాళ్లు రూ.90, బెల్లం రూ.50 నుంచి రూ.60, మైదా రూ.80కు విక్రయిస్తున్నారు. నలుగురు కుటుంబ సభ్యులు ఉన్న ఇంటిలో బక్షాలు చేసుకోవాలంటే గతంలో రూ.300 ఖర్చు అవుతుండగా ప్రస్తుతం దాదాపు రూ.500 వరకూ వెచ్చించాల్సి వస్తోంది. నిత్యావసరాలతో పాటు కూరగాయల ధరలు కూడా పెరిగిపోయాయి. టమోట కిలో రూ.14, వంకాయ కిలో రూ.34, బెండ కిలో రూ.30, బీరకాయలు రూ.40, పచ్చిమిర్చి రూ.50, క్యాలీఫ్లవర్ రూ.44, చెవుళకాయ రూ.44, చిక్కుడు రూ.40 ఉన్నాయి. వాటికి తోడు గ్యాస్ ధర కాస్త తగ్గినా వెయ్యికి చేరువలోనే ఉంది. దీంతో సామాన్యులు ఉన్న దాంతోనే పండగను చేసుకుంటున్నారు. కొంత మంది తక్కువ సంఖ్యలో బక్షాలతో పండగ చేసుకుంటుండగా మరికొందరు పాయసంతో

పండుగ కష్టమే

దసరా పండుగ వస్తుందంటే వారం రోజుల ముందు నుంచే ఇండ్లలో పిండి వంటలు ఘుమఘుమలాడేవి. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో పేద, మధ్య తరగతి కుటుంబాల వారు పిండి వంటలకు దూరమవుతున్నారు. వంటనూనె ధరలు రోజు రోజుకు సలసలకాగుతున్నాయి 2 నెలల వ్యవధిలో ఏకంగా పల్లి, సన్ ఫ్లవర్ నూనెలు లీటరుకు 20 నుంచి 35 రూపాయల వరకు పెరిగింది. ఇక పప్పుల ధరలు చుక్కలనంటాయి ప్రతి పప్పు కిలో 15 నుంచి 35 రూపాయల వరకు పెరిగింది.

- లక్ష్మీ, చిన్న హరివాణం, ఆదోని మండలం.

బక్షం అన్నం కూడా కరువైతోంది

పండుగ వేళ నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పప్పులు, నూనెలతో పాటు వంట గ్యాస్ ధరలు దినదినం పెరుగుతున్నాయి. పెరిగిన ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతుండడంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. చివరకు బక్షం అన్నం కూడా కరువైతోంది. పేద, మధ్యతరగతి కుటుంబం పండుగల అంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- మమత, ఆదోని.

అసమానతలు లేని అభివృద్ధికి పోరాటం : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాష్ట్రంలో అసమానతలు లేని అభివృద్ధి జరగాలని సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలకు సిద్ధమవుతుందని ఆ పోరాటాలలో ప్రజలు పాల్గొనాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య భవన్ లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి అనేది కుంటు పడిందన్నారు. అవినీతి పెరిగిందని, మైనింగ్ మాఫియా, ఇసుక మాఫియా రాజ్యమేలుతుందని, భూ కబ్జాలు పెరిగాయని విమర్శించారు. రాష్ట్రంలో ఒక్క ఉద్యోగం కూడా కొత్తది రాలేదని, ఖాళీలు భర్తీ చేయలేదని, ఒక ప్రాజెక్టు నిర్మాణం కూడా పూర్తి చేయలేదన్నారు. రాష్ట్రంలో రైతులు కరువుతో అల్లాడుతున్నా కనీసం ఆలోచించే నాథుడే లేడని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో రోడ్ల వ్యవస్థ అధ్వానంగా ఉంది అనడానికి నిన్న భార్య కాన్పు కోసం రోడ్డులో వెళ్లి తిరిగిరాని లోకానికి వెళ్లి భార్య భర్తలు ఒకే హాస్పిటల్‌లో ఉన్న సంఘటన ప్రజలందరిని కలిచి వేసిందని ఇది జగన్మోహన్ రెడ్డి పరిపాలనకు నిదర్శనమని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానన్న బిజెపి,తెస్తానన్న జగన్ ఇద్దరు కలిసి రాష్ట్ర ప్రజలను మోసగించారని, వెనకబడిన ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని మోసం చేశారని తెలిపారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ విధానాల కోసం, ప్రజా సంక్షేమ కోసం, నిరుద్యోగ సమస్యలు పరిష్కారం కోసం, రైతుల సంక్షేమమనే ప్రణాళిక ద్వారా ప్రజల ముందుకు వెళుతుందని, ఈ ప్రణాళికను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. ఈనెల 30న ఆదోని, కర్నూలులో భారీ బహిరంగ సభలు నిర్వహిస్తున్నామనితెలిపారు. ఈ బహిరంగ సభలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి.రాముడు, రాజశేఖర్, మధు, మండల కార్యదర్శి శీనయ్య, నాగన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇక్బాల్ హుస్సేన్

దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అశ్వక్‌ఉల్లా ఖాన్

జయంతిలో ఆవాజ్ నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆవాజ్ నగర కమిటీ ఆధ్వర్యంలో షాహిద్ అశ్వక్ ఉల్లాఖాన్ 123వ జయంతిని ఆవాజ్ నగరకమిటీ ఆధ్వర్యంలో కర్నూలులో ఘనంగా నిర్వహించారు. నగర కమిటీ నాయకులు షేక్ అబ్దుల్ నాసిర్ అధ్యక్షతన నిర్వహించిన జయంతి సభలో అవాజ్ కమిటీ నగర అధ్యక్ష ,కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్ ,షేక్ మొహమ్మద్ షరీఫ్ మాట్లాడారు. అశ్వక్ ఉల్లా ఖాన్ ఈ దేశం విముక్తి కోసం అతిపిన్న వయస్సులోనే తృణప్రాయంగా తన ప్రాణాలను అర్పించారన్నారు. ఆయన అత్యంత సన్నిహిత మిత్రుడు రాంప్రసాద్ బిస్మిల్‌తో కలిసి చౌరచౌరీ సంఘటన జరిగినప్పుడు,బ్రిటిష్ వారు మన భారతీయులనుంచి పన్నుల రూపంలో తీసుకెళుతున్న ధనాన్ని అడ్డుకొని పేద బడుగు బలహీన వర్గాల వారికి పంచిన కేసులో 27 యేళ్లకే బ్రిటిష్ ప్రభుత్వం ఉరిశిక్ష విధించిందన్నారు. 1900 అక్టోబర్ 22 జన్మించిన అశ్వక్ ఉల్లా ఖాన్ తన 27వ ఏట 1927 డిసెంబర్ 19న ఉరితీశారన్నారు. అటువంటి దేశభక్తులు మైనార్టీలలో అనేకమంది చరిత్రలో ఉన్నారన్నారు. టిప్పు సుల్తాన్, నవాబ్ గులాం రసూల్ ఖాన్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, హజరత్ బిబి మహల్ హజరత్ ఫాతిమా హజరత్ రజియా లాంటి ఎందరో మహానుభావులు ఉన్నారన్నారు. అటువంటి చరిత్ర కలిగిన ముస్లిం మైనార్టీ సోదరులను, దళిత క్రిష్టియన్లను నరేంద్ర మోడీ నాయకత్వంలోని మతోన్మాద బిజెపి దాడులు చేసి ,అతి ఘోరంగా ,కిరాతకంగా చంపుతూ ,ప్రార్థన మందిరాలను ,కూల్చేస్తూ బైబిల్ ,కురాన్‌ను కాలుస్తూ దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రజలందరిని చైతన్యం చేసి అశ్వక్ ఉల్లా ఖాన్ వంటి వారి త్యాగాలను ప్రజలను తెలిజేయాలన్నారు. చైతన్యం చేస్తూ ప్రజలను జాగతి చేయాల్సిన అవసరం ఎంతైనా అవసరమన్నారు. ఇలాంటి స్వాతంత్ర సమరయోధుల వర్ధంతిలను, జయంతులను ఘనంగా జరుపుకోవాలని ఆవాజ్ కమిటీ నమ్ముతుం దన్నారు. ఆవాజ్ కమిటీ నగర నాయకులు షేక్ అబ్దుల్ షహీద్ అశ్వక్ ఉల్లా ఖాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన అవాజ్ కమిటీని అభినందించారు. ఆవాజ్ కమిటీ నగర నాయకులు షేక్ అబ్దుల్ నయీమ్, షేక్ ఇలియాస్ భాష, షేక్ మహబూబ్ బాషా, షేక్ ఇంతియాజ్, డి అబ్దుల్ దేశాయ్, షేక్ మాసూమ్ భాష, షేక్ ఫక్రుద్దీన్ ,షేక్ షబ్బీర్ భాష, షేక్ సాబీర్, నయీమ్, షేక్ ఇలియాస్ భాష, షేక్ మహబూబ్ బాషా, షేక్ ఇంతియాజ్, డి అబ్దుల్ దేశాయ్, గౌస్ భాష, షేక్ శాలి భాష,,షేక్ రసూల్ భాషా ,షేక్ మాసూమ్ భాష, షేక్ ఫక్రుద్దీన్ ,షేక్ షబ్బీర్ భాష, షేక్ సాబీర్, తదితరులు పాల్గొన్నారు.

బన్ని ఉత్సవం ప్రశాంతంగా జరుపుకోవాలి

- 100 నైట్ విజన్ సిసి కెమెరాలు, 600 ఎల్ఇడి లైట్లు, డ్రోన్ వీడియో కెమెరాల నిఘా ఏర్పాటు - వెయ్యి మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత - సంప్రదాయాన్ని గౌరవిస్తాం - నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠినచర్యలు - కర్నూలు జిల్లా ఎస్పి జి. కృష్ణకాంత్

మాట్లాడుతున్న ఎస్పి జి. కృష్ణకాంత్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

'దసరా పండుగను పురస్కరించుకొని ఈనెల 24న రాత్రి జిల్లాలో ప్రతిష్టాత్మకంగా జరిగే దేవరగట్టు శ్రీమాలమల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవం ప్రశాంతంగా నిర్వహించుకోవాలి. జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బన్ని ఉత్సవానికి 1000 మంది పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశాం.' అని కర్నూలు జిల్లా ఎస్పి జి.కృష్ణకాంత్ తెలిపారు. దేవరగట్టు బన్నీ ఉత్సవాల ఏర్పాట్లపై ఆయన ప్రజాశక్తితో తెలిపిన వివరాలు ....

బన్నీ ఉత్సవానికి ఎలాంటి ఏర్పాట్లు చేశారు.?

ఎస్పి: వెయ్యిమంది పోలీసులతో పటిష్ట భద్రత చర్యలు చేపట్టాం. అడిషనల్ ఎస్పి, 9 మంది డిఎస్‌పిలు, 29 మంది సిఐలు, 66 మంది ఎస్ఐలు, 155 మంది ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్ళు, 377 మంది కానిస్టేబుళ్ళు, 48 స్పెషల్ పార్టీబృందాలు, 2 పట్లూన్ల ఎపిఎస్‌పి బలగాలు, 185 మంది హోంగార్డులు బన్ని ఉత్సవం బందోబస్తు విధులలో పాల్గొంటారు.

శాంతిభద్రలతు విఘాతం కలుగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్‌పి: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై జిల్లా పోలీసు యంత్రాంగం గట్టి నిఘా ఏర్పాటు చేసింది. బన్ని ఉత్సవంలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి, అల్లర్లు, నిప్పులు విసరడం వంటివి సృష్టిస్తే అలాంటి వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించడానికి 100నైట్ విజన్ సిసి కెమెరాలు, 600 ఎల్ఇడి లైట్లు, డ్రోన్ కెమెరా, వీడియో కెమెరాలను వినియోగిస్తున్నాం.

ఇప్పటి వరకు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకున్నారు?

ఎస్‌పి: మద్యం సేవించి రింగులు గల కర్రలతో ఉత్సవంలో పాల్గొనడం వల్ల తలలకు గాయాలు కావడం వంటి దుష్పరిమాణాలపై దేవరగట్టు చుట్టు ప్రక్కల 15 (నెరణికి,కొత్తపేట, అరికెర, ఎల్లార్తి,) గ్రామాలలో పోలీసు , రెవిన్యూ శాఖల సమన్వయంతో ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అవగాహన సదస్సులు నిర్వహించాం. 10 గ్రామాల్లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేశాం. నాటుసారా, కర్ణాటక లిక్కర్ ను సీజ్ చేశామన్నారు. నాటుసారా విక్రయదారులు, కర్ణాటక లిక్కర్ అమ్మేవారి పై 15 కేసులు నమోదుచేశాం. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇంతకు మునుపు ఘర్షణల్లో పాల్పడ్డ వారిని, అక్రమ మద్యం రవాణా చేసే వారిని గుర్తించి 100 మందిని బైండోవర్ చేశాం. సెబ్ పోలీసులు కూడా దాడులు నిర్వహించి అరెస్టులు చేశారు. దేవరగట్టు చేరుకునే పరిసర గ్రామాల్లోనూ, ప్రధాన రహదారుల్లోనే కాక చిన్న చిన్న దారుల్లోనూ బందోబస్తు, చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఉత్సవంలో ఎలాంటి రక్త గాయాలు కాకుండా పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తాం.

ప్రమాదాలు జరగకుండబా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ఎస్‌పి: బన్ని ఉత్సవంలో ఫైర్ సిబ్బంది, వైద్యసిబ్బంది, అంబులెన్స్ సర్వీసులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నాం. బన్ని ఉత్సవం ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహంచాలని, భక్తుల్లో మార్పురావాలి. కర్రల సమరానికి స్వస్తి పలకాలని దేవరగట్టు పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ సందర్భంగా జిల్లా ఎస్పి విజ్ఞప్తి చేశారు.

రక్తదానం చేస్తున్న మేయర్ గన్‌మెన్ సలీం

మానవత్వం చాటుకున్న మేయర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగర మేయర్ బివై. రామయ్య మానవత్వాన్ని చాటారు. ఆదివారం గూడూరు మండలానికి చెందిన మూడేళ్ల పాప ఎస్ఆర్. పేటలోని బాలాజీ హాస్పిటల్‌లో హిమోగ్లోబిన్ తక్కువై రక్తం అత్యవసరం అవ్వగా, వారి కుటుంబ సభ్యులు ఫోన్‌ద్వారా నగర మేయర్ బివై. రామయ్య ను సంప్రదించారు. మానవత్వంతో స్పందించిన మేయర్, ఆయన గన్‌మెన్ పి.సలీం ద్వారా రక్తం ఇప్పించారు. ఈ సందర్భంగా సలీంను మేయర్ అభినందించారు.

రాజకీయ మైలేజీ కోసమే ఎమ్మెల్యే విమర్శలు : టిడిపి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాజకీయ మైలేజీ కోసమే కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ జిల్లా టిడిపి సీనియర్ నాయకులు డి.విష్ణువర్ధన్ రెడ్డి పై విమర్శలు చేస్తున్నారని కోడుమూరు నియోజకవర్గ టిడిపి యువ నాయకులు బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం కర్నూలు మండలం కొంతలపాడులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధాకర్, డి.విష్ణువర్ధన్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను ఆయన ఆదివారం తీవ్రంగా ఖండించారు. కొంతలపాడులో రూ.కోటితో నాడు నేడు పనుల కింద పాఠశాల నిర్మాణం పనులను డి.విష్ణువర్ధన్ రెడ్డి అడ్డుకుంటున్నారంటూ అసత్య ఆరోపణలు చేశారన్నారు. అధికారంలో ఉన్న తామే ఈ రకంగా మాట్లాడడం ఎమ్మెల్యే చేతగానితనానికి నిదర్శనం అన్నారు. విష్ణువర్ధన్ రెడ్డి మొదటి నుంచి భూస్వామ్య కుటుంబం నుంచి వచ్చారని, అవినీతి చేయాల్సిన అవసరం లేదన్నారు. రాజకీయ మైలేజ్ కోసం విష్ణువర్ధన్ రెడ్డిపై విమర్శలు చేస్తున్నారన్నారు. టిడిపి చేసిన అభివృద్ధి తప్ప నీ వల్ల నియోజక వర్గానికి ఒరిగిందేమీ లేదన్నారు. నేటికీ నియోజకవర్గంలో ప్రజలకు తాగు నీటిని అందించలేని దీనస్థితిలో ఎమ్మెల్యే ఉన్నరన్నారు. విష్ణువర్ధన్ రెడ్డిపై అసత్య ఆరోపణలు మానుకోవాలని లేదంటే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని పేర్కొన్నారు.

తుగ్గలి పోలీస్ స్టేషన్లో ఆయుధ పూజ

ప్రజాశక్తి- తుగ్గలి : మండల కేంద్రమైన తుగ్గలి, జొన్నగిరి పోలీస్‌తో పాటు తుగ్గలి, ఎద్దుల దొడ్డి, పెండెకల్లు ఆర్ఎస్,లింగనేని దొడ్డి,మల్యాల రైల్వే స్టేషన్ లో ఆదివారం సాయంత్రం స్థానిక ఎస్ఐలు మల్లికార్జున, రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆయుధాల పూజను నిర్వహించారు. స్టేషన్‌లో ఉన్న వివిధ రకాల ఆయుధాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్ఐలు మాట్లాడుతూ దసరా ఒకరోజు ముందు ప్రతి సంవత్సరం మాదిరిగానే ఆదివారం కూడా స్టేషన్లో సిబ్బందితో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పోలీస్ సిబ్బంది, రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాంక్ ఎదుటి ఇండ్లకు నీళ్లు వదలరు

వృద్ధులన్న గౌరవం లేని మున్సిపల్ ఇంజనీర్లు
500 పెట్టి ప్రయివేటు వాళ్ళ దగ్గర నీళ్లు కొంటున్నాం
పిపిఎస్ఎస్ బృందానికి బాధితుల వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బళ్లారి చౌరస్తా సమీపంలో నిర్మల్ నగర్‌లో దాదాపు రెండేళ్ల నుండి తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారుల, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. హామీలు తప్ప నీళ్ల సమస్య పరిష్కారం కాలేదని స్థానిక వృద్ధులు, ప్రజలు పట్టణ పౌర సంక్షేమ సంఘం (పిపిఎస్ఎస్) ప్రతినిధి బృందానికి తెలిపారు. ఆదివారం ఉదయం సంఘం ప్రతినిధి బృందం ఆ ప్రాంతంలో పర్యటించింది. నీళ్ల ట్యాంకు ఎదుట ఉన్న ఇండ్లకు నీళ్లు వదలకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని బృందంనాయకులు తెలిపారు. వృద్ధులమనే గౌరవం కూడా మున్సిపల్ ఇంజనీర్లకు లేదని ఎన్ పరమేష్, ఎస్.ముర్తుజా, ఎన్.మహేశ్వరి మాట్లా డుతూ ఉద్వేగానికి గురయ్యారు. నీటి సరఫరా పైపుల మరమ్మతుల పేరుతో రూ.వేలు తమ నుండి ఖర్చు పెట్టిస్తున్నారే తప్ప రోజుకు ఒక గంట కూడా నీళ్లు రావడం లేదని విమర్శించారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి మాట్లాడుతూ సమీ పంలో నీళ్ల ట్యాంకి ఉన్నప్పటికీ ఇంజనీరింగ్ అధి కారుల నిర్లక్ష్యం వల్ల తాగునీటి సమస్య ఏర్పడిం దన్నారు. అవసరం లేని అభివృద్ధి పనులతో రూ.కోట్లు ఖర్చు పెడుతూ ప్రజాధనం వృథా చేస్తున్న మున్సిపల్ అధికారులు, ఇలాంటి కాలనీలో కొత్త పైపులైన్ వేసి తాగునీటి సమస్య పరిష్కారానికి ఎందుకు కృషి చేయడం లేదని ప్రశ్నించారు?. సంబంధిత ట్యాప్ ఇన్‌స్పెక్టర్‌తో తాగునీటి సమస్య గురించి ప్రశ్నించగా మూడు నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నగర నాయకులు ఎ. వెంకటేశ్వర్లు, ఎస్.షమీవుల్లా, సీనియర్ న్యాయవాది రహంతుల్లా, జి.నరసింగ, రఘు, ఆనంద్‌బాబు, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు

పత్తికొండ ఆర్‌డిఒ బదిలీ

ప్రజాశక్తి- పత్తికొండ

ప్రభుత్వ ఉద్యోగాలలో బదిలీలు సహజమని, అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు వస్తుందని పత్తికొండ ఆర్‌డిఒ మోహన్‌దాస్ పేర్కొన్నారు. కెపిఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో ఆర్‌డిఒ మోహన్‌దాస్‌కు పూలమాలవేసి , శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మోహన్ దాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలన అందించాలని ఉద్దేశంతో జిల్లాలోని డివిజన్ ఏర్పాటు చేసిందని పత్తికొండను రెవిన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసి మొదటి ఆర్‌డిఒగా పదవి బాధ్యతలు చేపట్టినందుకు హర్షం వ్యక్తం చేశారు. పత్తికొండ నుంచి విజయవాడకు బదిలీపై వెళ్తున్నానని తెలిపారు.

పత్తికొండ ఆర్‌డిఒను సన్మానిస్తున్న కెపిఆర్‌మైత్రి చారిటబుల్ ట్రస్టు వారు

ఎమ్మెల్యే దృష్టికి రెండు పట్టాల వ్యవహారం

తహశీల్దార్ పై రోజుకో రూపంలో ఫర్యాదులు
ప్రజాశక్తి-పత్తికొండ

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నవరత్నాలలో భాగంగా నిరుపేద మహిళలకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని ముఖ్య ఉద్దేశం.. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలను ప్రభుత్వ అధికారులు తుంగులోకు తొక్కుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సంఘటన పత్తికొండ తహశీల్దార్ కార్యాలయంలో చోటు చేసుకున్నది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే 2020లో నిరుపేద మహిళలకు ఇల్లు పట్టాలను మంజూరు చేశారు. అదేవిధంగా పత్తికొండలో జగనన్న కాలనీలో సర్వేనెంబర్ 150 లో 37వ ఇల్లు పట్టాను మొదట చల్లాపద్మావతి అనే మహిళలకు మంజూరు చేశారు. తహశీల్దార్ కాసులకు ఆశపడి , అడ్డదారులు తొక్కుతూ సర్వే నెంబర్ 150 లో 37వ పట్టాను మరొకటి సృష్టించి పింజరి సమీరాకు మంజూరు చేశారు. చల్లా పద్మావతి కూలి పని చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటుంది. ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఇల్లు నిర్మించుకోలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. తహశీల్దార్ నన్ను మోసం చేశారని మహిళ కన్నీరు మున్నీరు అవుతుంది. తహశీల్దార్ రెండు పట్టాలు ఇచ్చిన బాగోతం ఎమ్మెల్యే దృష్టికి వెళ్ళింది. ఎమ్మెల్యే ఎటు తేల్చలేక తహశీల్దార్ చేసిన తప్పులను ఒప్పులు చేయడానికి తలనొప్పిగా మారింది. దీంతో రాజకీయ నాయకుల దృష్టికి వెళ్లిన న్యాయం జరుగుతుందో లేదో అని ఇరువురు లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ఏ పని చేయాలన్నా కాసులు ఇవ్వనిదే ఫైలు ముందుకు వెళ్ళదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పత్తికొండ తహశీల్దార్ కార్యాలయంలో అవినీతి అక్రమాలు జరుగుతున్నా పర్యవేక్షణ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఇంత తతంగం జరుగుతుందని మండల ప్రజలు బహిర్గతంగానే చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు పత్తికొండ తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

అంతర్జాతీయ పక్షుల సందర్శన శాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

అంతర్జాతీయ పక్షుల సందర్శన శాల ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలోని మునిసిపల్ గ్రౌండ్స్‌లో ఆదివారం అంతర్జాతీయ పక్షుల సందర్శన శాలను యజమాని సికె. ప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హఫీజ్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పక్షుల సందర్శన శాలను ప్రజలు, పిల్లలను ఎంతో ఆకర్షణగా ఏర్పాటుచేయడం జరిగిందని అన్నారు. ప్రపంచంలోని పక్షులను ఎలక్ట్రానిక్ సిస్టమ్ ద్వారా రూపొందించడం అభినందనీయం అని కొనియాడారు. ఈ సందర్శన శాలను కర్నూలు నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, కార్పొరేటర్లు విజయలక్ష్మి, షాషావలి, నాయకులు ఖాదర్‌బాష, హకీం, రియాజ్ బాబా, రాజేష్, నవీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పక్షుల ప్రదర్శన శాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

ప్రమాదవశాత్తూ చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- వెల్దుర్తి

వెల్దుర్తి మండలం రత్నపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి బోయ రామకృష్ణ (35)మృతి చెందాడు. వివరాల్లోకెళ్తే రెండు రోజుల క్రితం సమీప బంధువు చనిపోతే అంత్యక్రియలకు వెళ్లి అనంతరం చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి : కెవిపిఎస్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

దళితుల సమస్యల పరిష్కారానికి కెవిపిఎస్ నిరంతరం కృషి చేస్తుందని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం, జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ పేర్కొన్నారు. ఆదివారం మండలం పరిధిలోని కలుగొట్ల గ్రామం నందు కెవిపిఎస్ నూతన జండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ దళితుల సమస్యలను కెవిపిఎస్ దృష్టికి తీసుకొస్తే అందరూ కలిసి ఉమ్మడిగా పరిష్కరిద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కనకవీడురాజు పూజారినగప్ప సుమల అంతోని గుండప్ప కలుగొట్ల రాజా రమేష్, అధ్యక్షులు నరసింహులు, గ్రామ ప్రధాన కార్యదర్శి ఈరన్న, రంగన్న, రాముడు, నరసింహులు, రాలింగప్ప, మునిస్వామి, పాండు, గుడేకల్లు ఆనంద్, పెద్దయ్య, పురుషోత్తం, ఉరుకుందు, పుల్లప్ప, ఉరుకుందు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : టిడిపి

మాట్లాడుతున్న విజయభాస్కర్ గౌడ్

ప్రజాశక్తి - దేవనకొండ

టిడిపి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మండల టిడిపి కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్ సూచించారు. ఆదివారం టిడిపి పార్టీ కార్యాల యంలో ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌ను ప్రతి గ్రామంలో బూత్ కన్వీనర్‌లు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అదేవిధంగా టీడీపీ ప్రవేశ పెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి బూత్ ఇంచార్జి వారివారి బూత్‌లల్లో టీడీపీ సానుభూతి పరుల ఓట్లు ఉన్నాయా లేదా సరి చూసుకో వాలని, అక్రమంగా ఓట్లు తొలగిస్తే బిఎల్ఓ మీద కోర్టులో కేసులు వేస్తామ ని హెచ్చరించారు. 100 గృహాలకు ఒక కుటుంబ సారథిని ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, ఉచ్చిరప్ప, రామారావు నాయుడు,వీరేష్, మల్లయ్య, సర్పంచ్‌లు భాస్కర్, నాగరాజు గౌడ్, చిన్నరామప్ప,ఎంపీటీసీ తిమ్మప్ప,క్లస్టర్ ఇంచార్జి వెంకట స్వామి గౌడ్, యూనిట్ ఇంచార్జిలు రాజశేఖర్ గౌడ్, లతీఫ్, దేవేంద్ర గౌడ్, మస్తాన్, చాంద్ బాషా, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పెద్దయ్య, తెలుగు యువత నాయకులు రాజా సాబ్, నాగేష్,పురుషోత్తం గౌడ్ ఐటీడీపి నాయకులు రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడుగా ఈసా బాష

ప్రజాశక్తి - ఆదోని

ఈషా భాషను సన్మానించిన దృశ్యం

జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులుగా సీనియర్ జర్నలిస్టు ఈసా బాష నియామకం అయ్యారు. ఆదివారం పట్టణ ప్రముఖ పారిశ్రామిక వేత్త ఏసీ శ్రీకాంత్ రెడ్డి తన బృందంతో కలిసి ఈసా బాష నివాసంలో సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు. జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ నియాజ్ అహ్మద్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మండిగిరి బాష, వైసీపీ జిల్లా నాయకులు ఆర్ రహీం, ఏపీయుడబ్ల్యూజె పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్, ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆదోని ప్రధాన కార్యదర్శి ప్రజాశక్తి రిపోర్టర్ మునెప్ప, ప్రజా వాయిస్ వెంకటేష్ ఆయన నివాసంలో కలిసి అభినం దనలు తెలిపి శాలువా, పూలమాలలతో సత్కరించారు. జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ నియాజ్ అహ్మద్ మాట్లాడుతూ గతంలో తాను తహసీల్దార్‌గా, ఫుడ్ ఇన్స్పెక్టర్ గా ఉన్నప్పుడు ఈసా బాషను దగ్గరి నుండి గమనించానన్నారు. వినియోగదారుల రక్షణ మండలికి ఈసా బాష వన్నె తెచ్చారని, ప్రలోభా లకు లొంగకుండా పెద్ద పెద్ద వ్యాపారవేత్తలకు, రాజకీయ ఉద్దండులకు సైతం పట్టుబట్టి ఫైన్‌లు వేసి అప్పటి కలెక్టర్ల, జాయింట్ కలెక్టర్ల దృష్టిని ఆకర్షించి వారి నుండి కలెక్టర్ కార్యాలయంలో అవార్డులు, రివార్డులు అందుకున్నారని ప్రశంసించారు. పారిశ్రామిక వేత్త శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఆదోనికి చెందిన ఈసా బాష సేవలను గుర్తించి విజిలెన్స్ కమిటీలో చోటు కల్పించడం ఆదోని ప్రజలు గర్వించదగ్గ విషయమన్నారు. మత గురువు ముఫ్తి ఆసీఫుద్దీన్ ఖాద్రి, బడే ఆసర్ షరీఫ్, ముతవల్లి సయ్యద్ మహబూబ్ బాష, హాఫిజ్ షబ్బీర్, గూడూరు నాసీర్ కూడ ఈసా బాషను సన్మానించి ఆయన క్షేమం కోసం ప్రార్థించారు. జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులుగా సీనియర్ జర్నలిస్టు ఈసా బాష నియామకం పట్ల ఆదోని పట్టణ ప్రముఖులు, రాజకీయ నేతలు, విలేకరులు, మత పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

అభివృద్ధిలో ఎమ్మెల్యే చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

- జనసేన బాధ్యుడు మల్లప్ప

ప్రజాశక్తి - ఆదోని

జనసేనలో చేరిన నాయకులతో మల్లప్ప

రాయల్ ఫ్యామిలీ అని చెప్పుకోవడం కాదు అభివృద్ధిలో రాయల్టీ చూపి ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని ఆదోని జనసేన ఇన్చార్జి మల్లప్ప అన్నారు. ఆదివారం పట్టణంలోని మంగళ అనంత ఆంజనేయ స్వామి ఆలయంలోని ఫంక్షన్ హాల్లో ఆ పార్టీ నాయకుడు పులి రాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. అంతకుముందు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 150 మందికి మల్లప్ప కండువా కప్పి జనసేనలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్లప్ప మాట్లాడారు. 6 నెలలు ఆగితే ఆదోనిలో, ఆంధ్రప్రదేశ్‌లో జనసేన జెండా ఎగరేసి ఆదోని ఎందుకు అభివృద్ధికాదో చేసి చూపిద్ధామని అన్నారు. ఈ కార్యక్రమంలో వంశీ చైతన్య నర్సింగ్ హోమ్ అధినేత రమేష్ యాదవ్, జనసేన నాయకులు రేణు వర్మ, మహేష్ యాదవ్ ప్రకాష్ ,చిరుత రాజశేఖర్, గాజుల రాజశేఖర్, జయరాం, శ్యామ్, మహిళా నాయకురాలు రాజేశ్వరమ్మ, ఆరిఫ్, ఎంఎం కాలనీ బాలకృష్ణ, కార్యకర్తలు వీరమహిళలు పాల్గొన్నారు.

ఉరుకుందలో ఆటో స్టాండ్ ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - కౌతాళం

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

శ్రీ నరసింహ ఉరుకుంద వీరస్వామి పుణ్యక్షేత్రంలో ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్యలు పేర్కొన్నారు. ఆదివారం వీరారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆటో కార్మికులు సిఐటియు సంఘంలో చేరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి ఈరన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే మల్లయ్యలు మాట్లాడుతూఉన్నత చదువులు చదివి ఆటో కార్మికులుగా జీవనం సాగిస్తున్న వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. జీవో నెంబర్ 21 ఈ–చలానా, పెట్రోల్ డీజిల్ ధరలతో అనేక రకాలుగా ఆటో కార్మికులకు ప్రభుత్వం భారాలు వేస్తోందన్నారు. ఆటో డ్రైవర్లు యూనిఫామ్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రయాణికులతో సత్ప్రవర్తన కలిగి ఉండాలని, సాటి ఆటో కార్మికులతో సఖ్యతగా ఉండాలని వారు సూచించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆటో యూని యన్ అధ్యక్షులుగా నరసింలు, ఉపాధ్యక్షులుగా పకీరయ్య, నర్సింలు ప్రధాన కార్యదర్శిగా వీరారెడ్డి, జాయింట్ సెక్రటరీగా తాయప్ప, సుందర్ రాజు మరో 15 మందితో కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


పూజలు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణ

శరన్నవరాత్రుల సందర్భంగా పట్టణంలో మాచాని సోమప్ప నగర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారిని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంకతి లక్ష్మీనారాయణ దర్శించుకొన్నారు. అనంతరం అన్న దాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి యువజన సంఘం జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ, ఎమ్మిగనూరు పట్టణ నాయకులు ఎంఆర్ మోహన్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ ఊట్ల రమేష్, పద్మశాలి సంఘం నాయకులు నారాయణ, అడ్వకేట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల కడుపు కొట్టొద్దు

ప్రజాశక్తి - కౌతాళం

అధికారులతో తమ సమస్య చెప్పుకుంటున్న రైతులు

రైతుల కడుపులు కొట్టొద్దండి.. పంటలు ఎండిపోతున్నాయి.. సాగునీరు అందించి తమ పంటలను కాపాడండి..! సాగునీరు అందించకుంటే ఆత్మహత్యలే శరణ్యం అని కౌతాళం హాల్వి సెక్షన్ వద్ద రైతులు ఆందోళనకు దిగారు. తమ కాల్వ కింద సాగు చేసిన వరి పంట ఎండిపోతున్నాయని సాగునీరు విడుదల చేయాలని ఎల్ఎల్సి అధికారుల కాళ్లు పట్టుకుని రైతు వేడుకున్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. హాల్వి సెక్షన్ పరిధిలో చిరుతపల్లి, చూడి బంటకుంట సులేకేరి, మధిర పొదలకుంట, కాత్రికి గ్రామాల రైతులు పంటలు సాగు చేశారు. మధిర పొదలకుంట కాత్రికి ఏడు రోజుల నుండి సాగునీటి సరఫరా అధికారులు నిలిపివేశారు. ఈ విషయంపై ఆయా గ్రామాల రైతులు ఆదివారం నాడు డిస్ట్రిబ్యూటరీ వద్దకు చేరుకొని సాగునీరు విడుదల చేయాలని ఆందోళనకు దిగారు. తమ కాల్వకు సాగునీరు ఎందుకు నిలిపివేశారని నిలదీశారు. ఈ విషయం తెలుసుకున్న ఎల్ఎల్సి కిందిస్థాయి అధికారులు అక్కడి చేరుకొని రైతులతో చర్చించారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నీటి సరఫ రాను నిలిపివేయడం జరిగిందని అధికారులు తెలిపినా రైతులు ఆందోళనను ఉధృతం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఎల్ఎల్సి డిఈ ఈఈలకు సమాచారం తెలియజేయడంతో అధికారుల ఆదేశాల మేరకు జేఈ హుస్సేన్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ ఆదేశాల మేరకు ఎమ్మిగనూరుకు ముఖ్యమంత్రి రావడంతో నాలుగు రోజులు పిల్ల కాలువలకు నీటి సరఫరా నిలిపివేసి ముందుకు తీసుకెళ్లడం జరిగిందని హుస్సేన్ రైతులకు తెలిపారు. అనంతరం మరో మూడు రోజులు కోసిగి మండలానికి నీటిని తరలించడం జరుగుతుందని కావున మంగళవారం నుండి మళ్లీ మీకు సాగునీరు సరఫరా చేస్తామని చెప్పారు. రైతులు

- సాగునీరు విడుదల చేయాలని అధికారుల కాళ్లు పట్టుకున్న రైతు

అధికారుల కాళ్లు పట్టుకున్న రైతు

మాట్లాడుతూ 7 రోజుల నుండి సాగునీరు సరఫరా లేక పోవడంతో పొట్ట దశలో ఉన్న వరి పంటలు పొలాలు ఎండిపోయి బీటలు రావడం రావడం జరిగిందని, సాగునీరు అందకపోతే చేతికొచ్చిన పంటలు కళ్ళముందే ఎండిపోయి ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పంట పొలాలకు సాగునీరు అందించేంతవరకు ఇక్కడ నుండి కదిలేది లేదని భీష్మించి కూర్చున్నారు. పరిస్థితి విషమించి దాటుతుండడంతో అక్కడ ఉన్న పోలీసులు ఉమామహేశ్వరరావు, వీరాంజనేయులు చొరవ తీసుకొని పరిస్థి తిని ఎల్ఎల్సి ఈఈ డిఈలకు వివరించారు. దీంతో ఎల్ఎల్సి అధికారులు ఆ రైతులకు సాగునీరు సరఫరా నిలిపివేయకుండా చూడాలని ఆదేశం చడంతో డిస్ట్రిబ్యూటర్ షెటర్‌ను ఎత్తి సాగునీరు విడుదల చేశారు. దీంతో రైతులు ఆందోళనను విరమించి వారివారి పొలాలకు వెళ్లిపోయారు.

పరామర్శిస్తున్న శ్రీనివాసుల రెడ్డి

రవిచంద్రా రెడ్డికి పాలకుర్తి శ్రీనివాసులు రెడ్డి నివాళి

ప్రజాశక్తి - మంత్రాలయం

అనారోగ్యంతో మృతి చెందిన రవిచంద్రా రెడ్డి మృతదేహానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసులు రెడ్డి నివాళి అర్పించారు. ఆదివారం స్థానిక తెలుగు యువత జిల్లా మీడియా కో ఆర్డినేటర్ విజయ రామిరెడ్డి సోదరుడు, క్లస్టర్ ఇంచార్జ్ ఎల్లారెడ్డి అన్నగారి అల్లుడు అయిన రవిచంద్రా రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి సోదరులు టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస రెడ్డి రవిచంద్రా రెడ్డి మృతదేహానికి పూలమా లవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట క్లస్టర్ ఇంచార్జ్ ఎల్లారెడ్డి, సూగూరు నాగేష్,ఐ టిడిపి సాల్మన్ రాజ్, నీలకంఠ తదితరులు ఉన్నారు.

మతతత్వ బిజెపికి బుద్ధి చెప్పాలి

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

రానున్న ఎన్నికల్లో మతతత్వ పార్టీ బిజెపికి ప్రజలు తమ ఓటుతో రాబోయో ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జీ బాధ్యులు బాబూరావు ఆధ్వర్యంలో జోడోయాత్ర ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక రాఘవేంద్ర సర్కిల్ మీదుగా 8 కిలో మీటర్ల దూరంలో ఉన్న మాధవరం గ్రామం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న మతాలకు కులాలకు నిలయమైన భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగిందని ఇలాంటి దేశంలో భారతీయ జనతా పార్టీ మతాల మధ్య చిచ్చు పెట్టి శాంతికి భంగం కలిగించే విధంగా పాలన సాగుతోందన్నారు. నాటి ప్రధా నులు నెహ్రూ, ఇందిరాగాంధీ రాజీవ్ గాంధీ సోనియా గాంధీ మన్మోహన్ సింగ్‌ల పాలనలో దేశం సుభిక్షంగా ఉందని నేటి బిజెపి పాలనలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. దేశం సుభిక్షంగా ఉండాలంటే రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఏఐసిసి కార్యదర్శి మనియప్పన్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్, ఎన్ఎస్‌యుఐ నాదమధు యాదవ్, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాకే శంకర్ నాయకులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి .. ఆలూరు : ఖరీఫ్‌లో వేసిన పంటలకు వర్షాలు లేక అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆలూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు చిప్పగిరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో హులేబీడు గ్రామం నందు వేరు శనగ పంట పొలాలను ఎపి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గిడుగు రుద్ర రాజు, ఏఐసిసి సెక్రటరీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మయ్యప్పన్ పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నా యని, ప్రభుత్వాలు మమ్మల్ని పట్టించుకోవడం లేదని గిడుగు రుద్రరాజుతో ఓ రైతు వాపోయారు. అనంతరం పీసీసీ అధ్యక్షులు మాట్లాడుతూ నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం తక్షణ సాయంగా ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగ మధు యాదవ్, సాకే శంకర్, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బాబురావు, లక్ష్మీ నరసింహ యాదవ్, ఆలూరు మండల నాయకులు తుంబలబీడు లక్ష్మన్న, ఈరన్న, వరకుమార్, హొళగుంద మండల నాయకులు అమానుల్లా, చిప్పగిరి మండల అధ్యక్షులు దేగులపాడు మంజునాథ్, నాయకులు నరసింహ, వినోద్ కుమార్, రాంబాబు,విజయ్ కుమార్, గంగాధర్, లింగప్ప, నగరడోణ శ్రీరాములు, వీరాంజినేయులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి నిధుల మంజూరు హర్షణీయం

ప్రజాశక్తి- దేవనకొండ

వైసిపి ప్రభుత్వం సంక్షేమంతో పాటు మరోవైపు అభివృద్ధి పనులు వేగవంతం చేసిందని వైసిపి సీనియర్ నాయకుడు తెర్నేకల్ కొత్త కాపు మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎమ్మిగ నూరు పట్టణంలో ఈ నెల 19వ తేదీన జరిగిన చేదోడు కార్యక్రమం విజయవంతమైనట్లు వెల్లడించారు. ఎమ్మిగనూరు శాసనసభ్యులు చెన్నకేశవరెడ్డి గంజహళ్లి- తెర్నికల్ గ్రామ రహదారి మధ్యలో హంద్రీ వాగుపై బ్రిడ్జి నిర్మాణం గురించి వివరించగా రాష్ట్ర ముఖ్యమంత్రి అందుకు స్పందించి రూ. 47 కోట్లు మంజూరు చేస్తామని చెప్పడం జరిగిందన్నారు. ఈ నిధుల కేటాయి ంపు పట్ల హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఆలూరు నియోజకవర్గంలోని నగరడోన రిజర్వాయర్ నిర్మాణ పనులు జరిగితే ప్రజలకు సాగు తాగునీరు అందుతుందని తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు బదినెహాల్ విద్యార్థిని

ప్రజాశక్తి - ఆదోని

ఇటీవల జిల్లాలోని పగిడ్యాలలో జరిగిన జిల్లా స్థాయి జూనియర్ ఖోఖో పోటీల్లో కౌతాళం మండలం బదినెహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వైశాలి ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు హరినాథ రావు ఆదివారం విలేకరులకు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. ఎంపికైన వైశాలి, తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు నరసింహారాజులను అభినందించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి - నందవరం

శాంతిభద్రతకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మిగనూరు రూరల్ సీఐ మోహన్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలో నాగలదిన్నె గ్రామంలో ఎస్పి, డిఎస్పి ఆదేశాల మేరకు ఎస్ఐలతో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అనుమానిత వ్యక్తుల ఇళ్ళల్లో సోదాలు నిర్వహించామని, ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి, ప్రజలు గొడవలు పడకుండా శాంతియుత వాతావరణంలో జీవించాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకొని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయం సంఘటన జరిగిన ప్రజల సమన్వయం పాటించాలని, ఇష్టానుసారంగా గొడవలు చేసుకుంటే ఇరువు వర్గాలపై కేసు నమోదు చేసి, జైలుకు పంపుతామని, దసరా పండుగను గ్రామ ప్రజలందరూసంతోషంగా జరుపుకోవాలన్నారు. ఆయన వెంట నందవరం, గోనెగండ్ల ఎస్ఐలు తిమ్మయ్య, తిమ్మారెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ మోహన్ రెడ్డి

విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఆదోని

అభివాదం తెలుపుతున్న నేతలు

కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధనకై నవంబర్ 8న వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఆదోనిలోని ఎన్‌జీఓస్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఆయా రాష్ట్రాలలో తమకు అనుకూలంగా వ్యతిరేకంగా ద్వంద వైఖరి అవలంబిస్తోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీ కరణ చేస్తామని పార్లమెంట్ సాక్షిగా చెబుతూ వచ్చేనెల ఎన్నికల జరుగుతున్న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఉన్న ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కృషి చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటన పట్ల తమ వైఖరి ఏమిటో అర్థం అవుతోందన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. విద్యార్థి యువజుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలనుకోవడం దారుణమన్నారు. దీనికి వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మికులు అనేక ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోవడంలేదన్నారు. నవంబర్ 8 నాటికి కార్మికులు చేస్తున్న నిరాహార దీక్షలు 1000 రోజులు అవుతున్న సందర్భంగా వామపక్ష విద్యార్థి యువజన సంఘాలు ప్రత్యక్షంగా ఆందోళనలు పాల్గొనడంతో పాటు ఆరోజు విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తామన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపయోగపడుతున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ, పార్లమెంట్ నిర్మాణానికి కూడా ఉక్కునందించిన వంటివి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఎలా ప్రైవేటీకరణ చేస్తారని ప్రశ్నించారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీతోనే యువతకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. అత్యంత వెనుకబడినటువంటి రాయలసీమ జిల్లాల అభివృద్ధి కావాలంటే రాష్ట్ర విభజన నేపథ్యంలో ఇచ్చిన హామీ మేరకు కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, దీని ద్వారానే రాయలసీమ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగాలు దొరుకుతాయ న్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ సాధనే లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆదోనిలో కడపలో ఫ్యాక్టరీ సాధన, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన, మహిళా, కార్మిక, మేధావులతో ఆదోని పట్టణంలో ఈనెల 26న రౌండ్ సమా వేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐ ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యస్. షాబీర్ బాష, ఎఐఎస్ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యస్. షాబీర్ బాష, పీడీఎస్‌యు ఉమ్మడి జిల్లా కార్యదర్శి నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్య క్షులు శ్రీనివాసులు, పీడీఎస్ఓ రాష్ట్ర నాయకులు తిరుమలేష్, పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షులు అఖండ, బిడీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్, ఏఐవైఎఫ్ మండల కార్య దర్శి అంజిత్ గౌడ్, ఏఐడిఎస్ఓ నాయకులు శివరాజ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, నాయకులు, కార్తీక్, గోవర్ధన్, శివ, ఎస్ఎఫ్ఐ నాయకులు దినేష్, గౌస్, శశి, పీడీ ఎస్‌యు నాయ కులు నరేష్, శివ, లోకేష్, బిడీఎస్ఎఫ్ నాయకులు సాయి, శీను, గిరిష్, పీడీఎస్ఓ నాయకులు అశోక్ పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికారమే లక్ష్యం

మాల మహానాడు రాయలసీమ జిల్లాల అధ్యక్షులు రంగయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నూతన కమిటీ సభ్యులతో రాష్ట్ర జిల్లా నాయకులు

బహుజన రాజ్యాధికారం సాధించడమే మాల మహానాడు లక్ష్యంగా పనిచేస్తుందని మాల మహానాడు రాయలసీమ జిల్లాల అధ్యక్షులు రంగయ్య అన్నారు. ఆదివారం రచ్చుమరి గ్రామంలో మాల మహానాడు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు రాష్ట్ర జిల్లాల నాయకులను డప్పు వాయిద్యాలతో ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు రంగయ్య మాట్లాడుతూ అన్ని కులాల మధ్య సోదర భావాన్ని పెంపొందిచడమే లక్ష్యంగా ముందుకు వెళతాం అని తెలిపారు. ఎస్సి ఎస్టీ బిసి మైనారిటీలను కలుపుకొని అతిపెద్ద కూటమిగా ఏర్పడి రాజ్యాధికారం సాధిస్తాం అని తెలిపారు. ఎస్సి ఎస్టీల కన్నా బిసిలకే రాజ్యాంగంలో అంబేద్కర్ అధిక ప్రాధాన్యత ఇచ్చారని అది తెలుసుకోక అంబేద్కర్ విగ్రహాలను అడ్డుకోవడం సరికాదన్నారు. రాబోయే ఎన్నికల నాటికి ప్రతి ఊరు వాడ తిరిగి చైతన్యం చేస్తామని తెలిపారు. అణిచివేత ఎక్కువైతే తిరుబాటుకు తెర లేపుతాం హెచ్చరించారు. జాతీయ నాయకులు గద్దం నాగముని మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారిన దళితుల బతుకులు మారడం లేదని అన్నారు. నూతన కమిటీలో మాలమహానాడు జిల్లా అధ్యక్షులుగా మాల మల్లేష్‌ని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. జైభీమ్ యువదళం జిల్లా అధ్యక్షులుగా నల్లన్నను ఉపాధ్య క్షులు కార్యదర్శిగా రాముడు బలరాం, సహాయక కార్యదర్శిగా నరసప్ప, చితనందలను ఎన్నుకు న్నారు. అదేవిదంగా గ్రామ స్థాయిలో పురుషుల కమిటీ మహిళ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాలలు పాల్గొన్నారు.

మాదాసి, మాదారి కురువ నూతన కమిటీ ఎన్నిక

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - హోళగుంద

హొళ్లగుంద మండల మదాసి, మదారి కురువ నూతన కమిటీని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామమోహన్ ఆధ్వర్యంలో ఆలూరు తాలూకా అధ్యక్షులు, తాలూకా ప్రధాన కార్యదర్శి పెద్దహ్యాట, మల్లయ్య, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కాలిక ప్రసాద్, గౌరవ సలహాదారుడిగా కోగిలతోట శేషప్ప, డిసి బొజ్జన్న, డాక్టర్ రామాంజనేయులు, మండల అధ్యక్షుడిగా పంపన్న, మండల ఉపాధ్యక్షుడిగా రవి స్వామి, బసవరాజు, మండల ప్రధాన కార్యదర్శి ఎల్లార్తి లక్ష్మన్న, నిర్వాహక అధ్యక్షుడు వంధవగిలి గర్జప్ప, కోశాధికారి మైలారి, సహాయ కార్యదర్శి గాదిలింగ, కార్యవర్గ సభ్యులుగా నరెగలప్ప, శివకుమార్, సిద్ధప్ప,రామకోటి, లింగంపల్లి భీమ,గౌరవ వీరేష్‌లను మండల కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ మోహన్, ఆలూరు తాలూకా ప్రధాన కార్యదర్శి మల్లయ్య మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గంలో 62 వేల మదాసి కురువల ఓటర్లు ఉన్నా ప్రభుత్వాలు కానీ పార్టీలు కానీ ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వడం లేదని పేర్కొన్నారు. మదాసి మదారి కురువ ఎస్సి సర్టిఫికెట్స్ జారీ చేయాలని, బీరప్ప స్వామి పూజారులకు గౌరవ వేతనం ఇవ్వాలని, గొరవయ్యలకు కళాకారులుగా గుర్తించి పింఛన్ మంజూరు చేయాలని, రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, గొర్రెల కాపరులకు జీవిత ప్రమాద బీమా కల్పించాలని, ఆలూరు నియోజకవర్గం కేంద్రంలో ఒక ఎకరం ప్రభుత్వ భూమిని కనకదాసు భవనానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అలురూ తాలూకా గౌరవాధ్యక్షుడు రంగన్న, అలూరు మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, వంద వాగిలి సర్పంచ్ భర్త శేషప్ప, ఎండిహళ్లి సర్పంచ్ సుధా కర్,హొలగుంద గదిలింగప్ప, మల్లికార్జున, చిన్నచగప్పా, కెంప గదిలింగా, రాయన్న సంగం ఆలూరు తాలు ప్రధాన కార్యదర్శి మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ పిఎస్‌లో ఆయుధ పూజ

ప్రజాశక్తి- దేవనకొండ

మండల కేంద్రమైన దేవనకొండ పోలీస్ స్టేషన్లో ఆదివారం దసరా పండుగ ఉత్సవాల్లో భాగంగా ఆయుధపూజను స్థానిక ఎస్సై భూపాలుడు, పోలీస్ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండితుల మంత్రోచ్చరణల మధ్య ఆయుధాలకు ప్రత్యేక పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - చిప్పగిరి

కర్నూల్ సిల్వర్ జూబ్లీ బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో 20వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి బైబిల్ క్విజ్, పాటల పోటీలలో చిప్పగిరి వాసులు ప్రతిభ కనభరిచారు. ఎం జనార్ధన్, బైబిల్ క్విజ్, పాటల పోటీలలో మొదటి స్థానంలో, బైబిల్ క్విజ్‌లో డి మేరీ మొదటి స్థానంలో విజయం సాధించి జిల్లాలో చిప్పగిరి జైన్ ప్రేయర్ హాల్‌కు పేరు తీసుకువచ్చారని సంఘ కాపరులు టి జయమ్మ, రాజు పేర్కొన్నారు. ఈ వారం సీయోను సంఘం ఆధ్వర్యంలో విజేతలను సన్మానించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం ఇవ్వాలి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి కోసిగి

కోసిగి మండలంలో పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇచ్చి ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సిఐటియు కోసిగి మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. ఆదివారం కోసిగి మండలంలోని చింతకుంట, పల్లిపాడు,దొడ్డి బెళగల్, చిన్న బొంపల్లి, పెద్ద బొంపల్లి, గ్రామాల్లో పర్యటించి పంటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉండటం వల్ల రైతులు వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయాయని అన్నారు. కనీసం పశు వులకు మేత అయినా వస్తుందని ఉద్దేశంతో వేరుశనగ పంట దున్నివేస్తున్నట్లు పల్లెపాడు రైతు లక్ష్మన్న రైతు సంఘం నేతలతో వాపోయారు. దసరా పండుగ తర్వాత వలసలు పోతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే పంట నష్టపోయిన ప్రతి ఎకరాకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం నష్టపరిహారము ఇవ్వాలని, పంట రుణాలు మాఫీ చేయాలని, వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు చూపించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 25న మండల కేంద్రంలో ఆందోళన చేపడుతున్నామని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వేరుశనగ పంటలను పరిశీలిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం బృందం

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE::KURNOOL
O.S. No. 586/2022

V. Veerabhadrudu
S/o late Chidambari,
aged about 68 years, Hindu,
R/O H.No. 51-971-A5, Plot No.9,
Municipal Employees Colony,
Kurnool City, Mandal & District. ...Plaintiff

Vs

V. Vijay Kumar
S/o Venkata Subbaiah,
aged about 36 years, Hindu,
Head Constable No.333,
R/O H.No.S7/625, S.A.P Camp,
Kurnool City, Kallur Mandal,
Kurnool District. ...Defendant

SUMMONS

Where as the Plaintiff filed the above suit against the defendant seeking for recovery of amount due under suit promissory note, you the defendant hereby directed to appear before this Hon'ble Court or appear through an Advocate on your behalf to file your written statement and for trail with documents on 06-11-2023 at 10.30 A.M. without fail otherwise the matter will be settled, in your absence, by this Hon'ble Court.

K.Uma Hanumantha Rao
ADVOCATE



నంది వాహనంపై స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం

దసరాకు ధరాఘాతం

- పెరిగిన ధరలతో సామాన్యుల బెంబేలు
- పండగ పూట బక్ష భోజనం కష్టమే



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

దసరాకు సామాన్యులకు ధరాఘాతం తప్పడం లేదు. పెరిగిన ధరలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పండగ పూట బక్ష భోజనం కష్టంగా మారింది. చాలా మంది ఉన్న దాంట్లోనే సర్దుకుని పండగను చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది...

సామాన్యులకు దసరాకు ధరాఘాతం తప్పడం లేదు. దసరా సందర్భంగా జిల్లాలో చాలా మంది బక్షాలను చేసుకుంటారు. నిత్యావసర ధరలకు రెక్కలు రావడంతో సామాన్యులకు పండగ పూట బక్ష భోజనం కష్టంగా మారనుంది. బక్షాలకు ప్రధానంగా నూనె, బెల్లం, శనగలు, మైదాను ఉపయోగిస్తారు. లీటర్ పామాయిల్ ప్యాకెట్ రూ.120, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.140 నుంచి రూ.170 వరకూ పలుకుతోంది. ఇతర సరుకుల ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. గత ఏడాది కందిపప్పు రూ.120 ఉండగా ప్రస్తుతం రూ.170 ఉంది. సనఫ్లవర్ ఆయిల్ గత ఏడాది రూ.100 ఉండగా ప్రస్తుతం రూ.150, వేరుశనగ విత్తనాలు గతంలో రూ.80 ఉండగా రూ.120, ఎండు మిరపకాయలు రూ.100 ఉండగా ప్రస్తుతం రూ.130, బెల్లం గతంలో రూ.30 ఉండగా ప్రస్తుతం రూ. 55, శనగపప్పు గతంలో రూ. 60 ఉండగా ప్రస్తుతం రూ.80 ఉన్నాయి. వీటికి తోడు పెట్రోలు డీజిల్, గ్యాస్ అను నిత్యం పెరగడం వల్ల వీటి ప్రభావం నిత్యావసరాలపై పడి పేదప్రజల జీవితాలు కడు దుర్భరంగా మారాయి. నందికొట్కూరులో కిలో శనగ బ్యాళ్లు రూ.90, బెల్లం రూ.50 నుంచి రూ.60, మైదా రూ.80కు విక్రయిస్తున్నారు. నలుగురు కుటుంబ సభ్యులు ఉన్న ఇంటిలో బక్షాలు చేసుకోవాలంటే గతంలో రూ.300 ఖర్చు అవుతుండగా ప్రస్తుతం దాదాపు రూ.500 వరకూ వెచ్చించాల్సి వస్తోంది. నిత్యావసరాలతో పాటు కూరగాయల ధరలు కూడా పెరిగిపోయాయి. టమోట కిలో రూ.10, వంకాయ కిలో రూ.30 ఉన్నా బెండ కిలో రూ.30, బీరకాయలు రూ.40, పచ్చిమిర్చి రూ.40, క్యాలీఫ్లవర్ రూ.44, చెవుళకాయ రూ.44, చిక్కుడు రూ.40 ఉన్నాయి. వాటికి తోడు గ్యాస్ ధర కాస్త తగ్గినా వెయ్యికి చేరువలోనే ఉంది. దీంతో సామాన్యలు ఉన్న దాంతోనే పండగను చేసుకుంటున్నారు. కొంత మంది తక్కువ సంఖ్యలో బక్షాలతో పండగ చేసుకుంటుండగా మరికొందరు పాయసంతో సరిపెట్టుకుంటున్నారు.

పాయసంతో సరి..

దసరాకు సాధారణంగా బక్షాలు చేసుకునే వాళ్లం. ఇప్పుడు బక్షాలు చేసుకోవాలంటే కనీసం రూ.500 ఖర్చు అవుతోంది. నిత్యావసర సరుకుల ధరలు పెరగడం వల్ల ఉన్న దాంట్లో సర్దుకోవాల్సి వస్తోంది. ఈ సారి బక్షాల బదులు పాసయంతో సరిపెట్టుకోవాల్సిందే.

- పబ్బతి శివ ప్రసాద్, నందికొట్కూరు.

మహా గౌరిగా అమ్మవారు

- నంది వాహనంపై స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలంలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో ఆదివారం మహాగౌరి అలంకారంలో అమ్మవారు, నందివాహనంపై స్వామి అమ్మవార్లు శ్రీశైలం ప్రధాన విధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మహోత్సవాలలో భాగంగా 8వ రోజు అమ్మవారికి మహాగౌరి అలంకారంలో అలంకరించి, నంది వాహనంపై స్వామి అమ్మ వార్లను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి రాత్రి వరకు అమ్మవారికి శ్రీచక్రార్చన, నవావరణార్చన, విశేష కుంకుమార్చనలు, రుద్రహెూమం, చండ హెూమం, చతుర్వేదపారాయణలు, రుద్ర పారాయణ, చండీ పారాయణ, జపానుష్ఠానాలు, వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ఆస్థాన సేవ, సువాసిని పూజలు చేశారు.

గ్రామోత్సవం : దసరా మహోత్సవాలలో భాగంగా మహాగౌరి అలంకారంలో ఉన్న అమ్మవారిని, నంది వాహనంపై ఉన్న స్వామి అమ్మవార్లను వివిధ రకాల కళా నృత్య ప్రదర్శనలతో ఆలయ రాజగోపురం గుండా ప్రధాన వీధుల్లోకి ప్రవేశింపచేసి రథశాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథశాల వద్ద నుండి నంది గుడి, బయలు వీరభద్ర స్వామి వరకు వివిధ రకాల నృత్య ప్రదర్శన, కోలాటం, చెక్కభజన, తప్పెటచిందు, వేదమంత్రాల మధ్య గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు : భక్తులను అలరించేందుకు ఆలయ దక్షిణ మాడ వీధుల్లో నిత్య కళా వేదికపై సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 10.30 గంటల వరకు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముందుగా తెనాలికి చెందిన ఎం.విశ్వనాథ శర్మ గారిచే దేవి భాగవతం, హైదరాబాద్‌కు చెందిన విష్ణు బట్ల కార్తిక్ పద్య పఠనం, జోష్న సిరి ఆర్టిస్ట్ వారి సంప్రదాయం నృత్య ప్రదర్శన, నందికొట్కూరుకు చెందిన సాయి నిక్షిత ఆర్ట్స్ కళాశాల వారిచే సంప్రదాయం నృత్య ప్రదర్శన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి.

శరవేగంగా నంద్యాల పట్టణ అభివృద్ధి : ఎమ్మెల్యే

- అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. నంద్యాల పట్టనలోని 18వ వార్డులో రూ. 73.30 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను, పలు అభివృద్ధి పనులను ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ ఛైర్ పర్సన్ మాబున్నిసా, వార్డ్ కౌన్సిలర్ దేశం సులోచన, వైసిపి నాయకులు దేశం సుధాకర్ రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎన్జీఓ కాలనీపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మరింత అభివృద్ధి చేపట్టేందుకు నిధుల మంజూరుకు చర్యలు చేపడతామని తెలిపారు. పార్క్ అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్సీ ఇసాక్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గంలో అభివృద్ధి శిల్పా కుటుంబంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ తదితరులు

మహానందిలో నిబంధనలకు నీళ్లు

- జ్వాలాతోరణం ఏర్పాటు స్థలం పక్కన వివాదాస్పదంగా వాహన పూజ
- దేవస్థానం నిబంధనలను పట్టించుకోని కాంట్రాక్టర్

ప్రజాశక్తి - మహానంది

మహానంది క్షేత్రంలో కార్తీకమాసంలో జ్వాలాతోరణం ఏర్పాటు చేసే స్థలం పక్కనే ఒక కాంట్రాక్టర్ మూడు వాహనాలకు వాహన పూజ నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. సాధారణంగా ఆ కాంట్రాక్టర్‌కు అగర్ బత్తీలు అమ్ముకోవడానికి క్షేత్ర ప్రధాన ద్వారం ఎదురుగా జ్వాలాతోరణం ఏర్పాటు చేసే స్థలం పక్కన కేటాయించారు. అక్కడ భక్తులకు అవసరమయ్యే అగర్ బత్తీలు, సాంప్రదాయ దుస్తులు అమ్ము కోవడానికి కూడా కొంత స్థలాన్ని కేటాయించారు. ఇదే అదునుగా భావించిన ఆ కాంట్రాక్టర్ అందరూ చూస్తుండగానే తన సొంత వాహనాలకు అక్కడ వాహన పూజ ఆదివారం నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ఎవరైనా విఐపిలు వస్తే ప్రస్తుతం వాహన పూజ నిర్వహించిన స్థలం వరకు వాహనాలకు అనుమతిస్తారు. అక్కడి నుండి గౌరవ మర్యాదలతో ఆలయ ప్రవేశ ద్వారం నుండి స్వామి అమ్మవార్ల దర్శనానికి వెళ్తుండడం సహజం. విఐపి, వివిఐపి వాహనాలకు సంబంధించి అక్కడ ఎలాంటి వాహనాలను శుభ్రపరచడం గానీ, వాహన పూజ కార్యక్రమాలు కానీ జరిపిన సందర్భాలు లేవు. ఇందుకు విరుద్ధంగా కాంట్రాక్టర్ వ్యవహరించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా వాహన పూజ టికెట్ తీసుకున్న వ్యక్తులు ఆలయ ప్రాంగణం బయట వాహన పూజ చేయటానికి పూజారులతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించారు. కానీ ఎవరైనా వాహన పూజ నిర్వహించాలంటే ఆలయ ప్రాంగణం బయట నిర్వహించాలి. తప్పనిసరిగా టికెట్ తీసుకోవాలనే నిబంధన ఉంది. పాలకమండలిలో ఒకరికి ఆ కాంట్రాక్టర్ సన్నిహిత కీలక వ్యక్తి కావడంతో ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఈ సంఘటనకు సంబంధించి ఆ కాంట్రాక్టర్‌పై చర్య తీసుకుని కాంట్రాక్టు రద్దు చేయాలని పలువురు కోరుతున్నారు. ఆలయ పరివర్తన నియమావళికి విరుద్ధంగా వ్యవహరించడం వల్ల భారీ మొత్తంలో జరిమానా విధించాలని పలువురు కోరుతున్నారు. గతంలో ఉద్యోగులు, కాంట్రాక్టర్లు తప్పులు చేసిన సందర్భంలో జరిమానాలు విధించారని, ఇప్పుడు కూడా అలా విధిస్తే మళ్లీ ఇంకెవరూ ఇలాంటి సాహసం చేయరని భక్తులు పేర్కొంటున్నారు. మరి చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచి చూడాల్సిందే.. అయితే అక్కడి వరకు వాహనాలను ఎవరు అనుమతించారు.? ఎందుకు అనుమతించారు..? అనుమతించిన వారిపై కూడా ఎలాంటి చర్య తీసుకుంటారనేది చర్చనీయాంశంగా మారింది.

జ్వాలాతోరణం ఏర్పాటు స్థలం పక్కన వాహన పూజ చేస్తున్న కాంట్రాక్టర్

నంద్యాల ఆర్‌డిఓ శ్రీనివాస్ బదిలీ

- నూతన ఆర్‌డిఓగా మల్లికార్జున రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల ఆర్‌డిఒ శ్రీనివాస్ బదిలీ అయ్యారు. చిత్తూరు జిల్లా డిఆర్‌ఒగా శ్రీనివాస్‌ను నియమిస్తూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కడప ఆర్‌డిఒగా విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున రెడ్డిని నంద్యాలకు బదిలీ చేశారు. పండగ సెలవులు ముగిసిన తర్వాత మల్లికార్జున రెడ్డి బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు రెవిన్యూ వర్గాలు వెల్లడించాయి.

బదిలీ అయిన శ్రీనివాస్

బిసిలకు జనాభా ప్రాతిపదికన సీట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఎపిలో అత్యధిక శాతం ఉన్న బిసిలకు జనాభా ప్రాతిపదికన ఎమ్మెల్యే, ఎంపీ సీట్లను అన్ని పార్టీలు ప్రకటించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి రఘు రాముడు యాదవ్, కార్యదర్శి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బాలస్వామి యాదవ్, గౌరవాధ్యక్షుడు రామకృష్ణలు డిమాండ్ చేశారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు వీరన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసిల చైతన్యం కోసం, బిసిలకు శాసన సభ ఎన్నికల్లో అన్ని పార్టీలు సీట్లను కేటాయించుటకు త్వరలో రాష్ట్రంలో రథయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. రథ యాత్రలో అన్ని పార్టీ అధ్యక్షులకు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టి జాతీయ నాయకుల మద్దతుతో తమ డిమాండ్లను ప్రకటిస్తామని చెప్పారు. బిసిలకు కేంద్ర ఆమోదంతో కులగణన చేపట్టాలని, ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, బిసి సబ్ ప్లాన్ ప్రకటించాలని, చట్ట సభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించుటకు చట్టం చేయాలని, మహిళా రిజర్వేషన్ ప్రకటించినా ఉప వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిసి నాయకులు శివకృష్ణ యాదవ్, విశ్రాంత డిఆర్వో నాగన్న, స్వాములు, రవి ఎల్లప్ప, డీలర్ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

29న ధర్నాను విజయవంతం చేయండి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - ఆత్మకూరు

గ్యారంటీ పెన్షన్ స్కీం రద్దు చేసి పాత పెన్షన్ స్కీం పునరుద్ధరించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను చెల్లించాలని, ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసే జీవో 117ను రద్దు చేయాలనే డిమాండ్ల తో ఈ నెల 29న ఆదివారం విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద జరిగే రాష్ట్రస్థాయి ధర్నాను జయప్రదం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎంఎస్ ఉమర్‌లు కోరారు. ఆదివారం పట్టనంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ధర్నాకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించాడు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 ప్రజాసంకల్ప యాత్రలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలో వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్దరిస్తానని ఉద్యోగ ఉపాధ్యాయులకు హామీ ఇచ్చి నాలుగున్నర సంవత్సరాల తర్వాత మాట తప్పి సిపిఎస్ కంటే ప్రమాదకరమైన జిపిఎస్‌ను అమలు చేయడం దుర్మార్గమన్నారు. తక్షణమే జిపిఎస్‌ని రద్దు చేసి ఒపిఎస్‌ని పునరుద్ధరించాలని, ఉపాధ్యాయ పెన్షనర్లకు రావాల్సిన డిఎ, పిఆర్సి బకాయలు రూ. 25 వేల కోట్లు, జడ్పిపిఎఫ్, ఎపిజిఎల్ఐ లోన్లు క్లైములు దాదాపు రూ.30 వేల కోట్లు, సరెండర్ నగదు, మెడికల్ బిల్లు మొత్తం రూ.2500 కోట్లు బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న 25 వేల ఉపాధ్యాయ పోస్టులకు కొత్త డిఎస్‌సి నిర్వహించా లన్నారు. ఈ నెల 29న విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే రాష్ట్రస్థాయి ధర్నాలోఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ సీనియర్ నాయకులు అబ్దుల్ వహీద్, జెడ్ దాసు, రామాంజనేయులు, రమేష్ బాబు, కృష్ణయ్య, రవికుమార్, భాస్కర్, నాగరాజు, రాజ్ కుమార్, పి.దాసు, సుబ్రమణ్యం, నాగేశ్వరరావు (రిటైర్డ్ ఎంఇఒ) తదిరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఐఎంఎ నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్ష కార్యదర్శులుగా డాక్టర్ వసుధా రాణి, డాక్టర్ పనిల్ కుమార్

ప్రజాశక్తి - నంద్యాల

ఐఎంఏ నంద్యాల శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాఖ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి కార్యవర్గాన్ని ప్రకటించారు. 2023-24 సంవత్సరానికి అధ్యక్షురాలుగా డాక్టర్ వసుధా రాణి, 24-25 సంవత్సరానికి ప్రెసిడెంట్ ఎలెక్ట్‌గా డాక్టర్ చిత్తలూరు మధుసూదనరావు ఎంపికయ్యారు. రెండు సంవత్సరాలపాటు ఉండే కార్యవర్గం కార్యదర్శిగా డాక్టర్ పనిల్ కుమార్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ భార్గవర్ధన్ రెడ్డి, డాక్టర్ జి.చంద్ర శేఖర్, డాక్టర్ డి.మాధవి, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ రాధిక జ్యోతి, డాక్టర్ ఎం.సునీత, డాక్టర్ నీలా ప్రసాద్, కోశాధికారిగా డాక్టర్ సురేంద్ర నాథ్ రెడ్డి, జాయింట్ కోశాధికారిగా డాక్టర్ మురళి, సెంట్రల్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ సహదేవుడు, ఫ్యామిలీ సెక్యూరిటీ స్కీమ్ ప్రతినిధిగా డాక్టర్ లక్ష్మయ్య, పిపిడబ్ల్యూ స్కీం ప్రతినిధిగా డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎంపికైన అధ్యక్ష కార్యదర్శులకు, ఇతర కార్యవర్గానికి ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ అభినందనలు తెలిపారు.

డాక్టర్ వసుధారాణి

డాక్టర్ పనిల్ కుమార్

చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-డోన్

డోన్ ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ గోడ పత్రికను నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గత 33 సంవత్సరాలుగా చెకుబముకిటాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నదని తెలిపారు. జిల్లాలోని ఉన్నత పాటశాలల ప్రధాన ఉపాధ్యాయులు సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహణకు సహకరించాలని కోరారు. సైన్స్ టాలెంట్ టెస్ట్ నవంబర్ 10న పాటశాల స్థాయిలో , నవంబర్ 30 న మండలస్థాయిలో, డిసెంబర్ 17న జిల్లా స్థాయిలో జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షల వల్ల విద్యార్థులలో పోటీతత్వం అలవడుతుందని, సృజనాత్మక పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు జి.రామమూర్తి, సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయులు రామ నరసప్ప, సురేష్ బాబు, పద్మావతి, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న డిఇఒ సుధాకర్ రెడ్డి తదితరుల

జాయింట్ కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న ఇఒ తదితరులు

మల్లన్నను దర్శించుకున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దసరా మహోత్సవాల సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. సంప్రదాయబద్ధంగా జాయింట్ కలెక్టర్ స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు ఆలయ రాజ గోపురం వద్దకు చేరుకున్నారు. వీరికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, వేద పండితులు సంప్రదాయపదంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత స్వామి అమ్మవార్లను జాయింట్ కలెక్టర్ దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేద పండితులు ఆశీర్వచనం పలికారు. శేష వస్త్రాలను, ప్రసాదాలను ఆలయ అధికారులు అందజేశారు.

వివాహ వేడుకల్లో ప్రముఖులు

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు పట్టణంలోని ప్రముఖ న్యాయవాది (అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్) ఖురాసాని ఆసిఫ్ అలీ ఖాన్ మేనకోడలు షాహిస్తా ఫర్వీన్, డాక్టర్ అఫ్రిద్ వివాహ వేడుకలకు ఆదివారం ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలకు వైసిపి శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. ఈ వేడుకల్లో ఫౌజియాకరం ఫౌండేషన్ చైర్మన్ ముల్లా అబ్దుల్ కరీం, వెలుగోడు సర్పంచి జైపాల్, ఎంపిపి లాలం రమేష్, అంబాల ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచి అబ్దుల్ కలాం, టిడిపి మోమిన్ రసూల్, రాఘవరెడ్డి, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో మాజీ న్యాయ శాఖ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి

కంచికామకోటి పీఠం వారు తెస్తున్న పట్టువస్త్రాలు

స్వామి అమ్మ వార్లకు పట్టు వస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి - శ్రీశైలం

దసరా మహోత్సవాల సందర్భంగా శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు ఆదివారం కంచి కామకోటి పీఠాధిపతి పట్టు వస్త్రాలను సంప్రదాయబద్ధంగా సమర్పించారు. కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి సూచనల మేరకు పట్టు వస్త్రాలతో స్థానిక శంకర మఠం సిబ్బంది ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్నారు. ఆలయ రాజగోపురం వద్దకు పట్టువస్త్రాలతో చేరుకున్న వీరికి దేవస్థానం క్యానిర్వహణ అధికారి పెద్దిరాజు, ఉభయ దేవాలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి ముందుగా పట్టు వస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముందుగా స్వామివారికి ఆ తర్వాత అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు ధర్మకర్తల మండలి సభ్యులు, స్థానిక కంచి మఠం కార్యదర్శి రామ్మోహన్ శర్మ, కంచిమఠం సిబ్బంది పాల్గొన్నారు.

తెప్పోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన ఇఒ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలంలో ఈ నెల 15న సంప్రదాయ పద్ధతిలో ప్రారంభమైన దసరా మహోత్సవాలు 24వ తేదీ ముగియనున్నాయి. ఉత్సవాల చివరి రోజు రాత్రి ఆలయ పుష్కరిణిలో స్వామిఅమ్మవార్లకు తెప్పోత్సవం నిర్వహించనున్నారు. తెప్పోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాట్లను ఆదివారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్ది రాజు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణ అధికారి మాట్లాడుతూ తెప్పోత్సవ సమయంలో పుష్కరిణిలో తగినంత నీటిమట్టం ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్థానిక పోలీస్‌శాఖ సమన్వయంతో భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెప్పోత్సవం సమయంలో పుష్కరిణి పరిసరాలలో తగినంత లైటింగు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు వి.రామకృష్ణ, శ్రీశైలం ప్రభ ఎడిటర్ డాక్టర్ సి అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇఒ పెద్దిరాజు

ప్రజా రక్షణ భేరిని జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి-డోన్

రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ నెల 30 నుండి నవంబర్ 15 వరకు సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగు ప్రజారక్షణభేరి బస్సు జాతాను జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కోయలకొండ నాగరాజు కోరారు. ఆదివారం డోన్ పట్టణంలోని కొండపేటలోని సిపిఎం కార్యాలయంలో పట్టణ, మండల కమిటీ సమావేశం నాయకులు షమీమ్ బేగం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబరు 15న ప్రజారక్షణ భేరి పేరుతో విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి ముందు మూడు ప్రాంతాల నుండి బస్సు యాత్రలు బయలుదేరుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాలు ప్రజా సమస్యల చుట్టూ కాకుండా పార్టీల సొంత ఎజెండాల చుట్టూ తిరుగుతున్నాయని, వీటిని ప్రజా సంక్షేమం చుట్టూ మళ్లించాలనే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో 339 మండలాల్లో కరువు పరిస్థితులు ఉన్నాయని, కష్ణా డెల్టాలో కొన్ని వేల ఎకరాల్లో పంట ఎండిపోతోందని తెలిపారు. దీనిపై ఎన్యూమరేషన్ చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుభరోసా కేంద్రాలకు అదనపు సిబ్బందిని నియమించి కరువు నుండి కాపాడేందుకు ప్రయత్నం ప్రారంభించాలని సూచించారు. పంట దెబ్బతినడం వల్ల వరిలో తాలు, తప్ప వస్తుందే తప్ప ఉపయోగం ఉండదన్నారు. చాలా ప్రాంతాల్లో ప్రజలకు తాగేందుకు మంచినీరు కూడా లేదని, జ్వరాలు పెరుగుతున్నాయని చెప్పారు. వైరల్ ఫీవర్లు వస్తే ఎక్కువ రోజులు ఉండటం, వచ్చినవారు నిస్సత్తువగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక వైద్య, పరిశోధకుల బృందాన్ని ఏర్పాటు చేసి జ్వరాలకు మూల కారణాలు గుర్తించి దాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న అసైన్డ్ భూముల వివరాలు తీయాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఇస్తున్న పట్టాలు బిఫారమా, ఒరిజినల్ పట్టాలా ముందు స్పష్టం చేయాలని, వాటిని మహిళల పేరుతోనే ఇవ్వాలని కోరారు. పేదల పేరుతో పెద్దవాళ్ల పరం చెయొద్దని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాలు పంచేందుకు సిద్ధంగా ఉందని గుర్తించారని, అర్హులందరికీ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు మండల అధ్యక్షులు రామాంజనేయులు, రైతు సంఘం మండల కార్యదర్శి నాగముద్దయ్య, డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు హబీబ్ భాషా, నక్కీ హరి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు ఇర్ఫానా బేగం, ఐద్వా పట్టణ నాయకురాలు అమృత, మాదేవి, షబానా, దేవీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

స్వచ్ఛ బేతంచెర్లకు అందరూ సహకరించాలి

- నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

స్వచ్ఛ బేతంచెర్ల పట్టణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి కోరారు. ఆదివారం బేతంచెర్ల పట్టణంలోని దుర్గాపేట కాలనీలో డ్రెయినేజీలు, వీధిలైట్లు, రోడ్లు తదితర సమస్యలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ కాలనీవాసులతో మాట్లాడుతూ వీధులలో మురుగునీరు నిల్వ ఉండకుండా, చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయకుండా నగర పంచాయతీ ఏర్పాటు చేసిన కుండీలలో వేయాలని, అప్పుడే వీధులు శుభ్రంగా ఉంటాయని చెప్పారు. ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రజలు వీధులను శుభ్రంగా ఉంచుకోవడానికి ఎవరి వంతు వారు అలవాటు చేసుకుంటే బేతంచెర్ల పట్టణం స్వచ్ఛ బేతంచర్లగా ఉండడానికి వీలవుతుందని అన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. విజయదశమి పండుగను అందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ శేఖర్, నడ్డి శ్రీనివాసులు, బొద్దుల రమేష్, జల్ల శ్రీనివాసులు, మధు, భాస్కర్, పుల్లయ్య, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాపేట కాలనీలో డ్రైనేజీ, వీధులను పరిశీలించిన నగర పంచాయతీ చైర్మన్

రాష్ట్ర ఖోఖో పోటీల్లో కర్నూలు జట్టుకు తృతీయ స్థానం

ప్రజాశక్తి - పగిడ్యాల

రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ ఖోఖో పోటీలలో ఉమ్మడి కర్నూలు జిల్లా జట్టు మూడవ స్థానంలో నిలిచింది. గత 15 రోజుల నుంచి పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా ఖోఖో జట్టుకు ఉచిత శిక్షణ తీసుకున్నారు. ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు చిత్తూరు జిల్లా యాదమరిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి కర్నూలు జిల్లా జట్టు పాల్గొంది. ఉమ్మడి కర్నూలు జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచినట్టు ఉమ్మడి కర్నూలు జిల్లా ఖోఖో చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి తెలిపారు. జట్టు మూడో స్థానంలో నిలిచినందుకు జట్టును, కోచ్‌ను ఖోఖో చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి, ఖోఖో ప్రెసిడెంట్ శంకర్, సెక్రెటరీ ప్రభాకర్, పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మధుసూదన్ రావు, తోకల పితాంబరరెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో మూడో స్థానంలో నిలిచిన కర్నూల్ జట్టు

వైసిపి రాక్షస పాలనకు చరమగీతం పాడాలి : టిడిపి

ప్రజాశక్తి - నందికొట్కూరు

రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బి.రాజన్న పేర్కొన్నారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలోని 22వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలను అందజేసి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెరిగిన ధరలు, దౌర్జన్యాలు, సంక్షేమాల పేరుతో రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. రాబోవు ఎన్నికలలో టిడిపిని గెలిపించుకోవాలని, రాక్షస పాలనకు చరమ గీతం పాడాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు పుష్ప రాజు, ప్రేమ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో మళ్లీ ఎలుగుబంట్లు సంచారం

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రంలోని దేవాలయాల వెనుక భాగాన ఉన్న నల్లమల్ల అడవి దిగువ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో తల్లి పిల్ల ఎలుగుబంట్లు సంచరించాయి. ఆవు పాల కోసం వెళ్తున్న వ్యక్తికి ఎలుగుబంట్లు తారస పడడంతో కేకలు వేశాడు. దీంతో తల్లిపిల్ల ఎలుగుబంట్లు పాడు పడిన కామేశ్వరి దేవి సత్రం శిథిల గదుల్లోకి వెళ్లాయి. మరోసారి తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో దేవస్థానం నిత్యాన్నదాన సత్రం, వినాయక నందీశ్వరాలయం ప్రహరీ సమీపంలోని చిన్న గేటు ప్రాంతంలో ఎలుగు బంట్లు సంచరించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఫారెస్ట్ అధికారులు భక్తుల శ్రేయస్సు కోసం ఇప్పటికైనా సాకులు మాని ఆ ఎలుగుబంటిని పట్టుకొని అడవిలోని దూర ప్రాంతాలకు తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి - శ్రీశైలం

దసరా మహోత్సవాల సందర్భంగా శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు నేడు రాష్ట్ర ప్రభుత్వం తరపున కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సంప్రదాయపద్ధంగా పట్టు వస్త్రాలు సమర్పిస్తారని దేవస్థానం అధికారులు తెలిపారు. మంత్రి రోడ్డు మార్గంలో కర్నూలు నుండి ఆత్మకూరు, శ్రీశైలం చేరుకుని స్వామి అమ్మ వార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రాన్ని సందర్శించే యాత్రికులకు, భక్తులకు దేవస్థానం అందిస్తున్న నిత్య అన్నదాన పథకానికి, ప్రసాద వితరణ వితరణకు చీరాలకు చెందిన సుజాత రూ. 1,01,116లను ఆదివారం విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి ఎం. ఫణిధర ప్రసాద్‌కు అందజేశారు. విరాళ అందజేసిన దాతలకు శేష వస్త్రాలను, ప్రసాదాలను ఆలయ అధికారులు అందజేశారు.

నేడు పోలీసు స్పందన తాత్కాలిక రద్దు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నేడు విజయదశమి పండగ సందర్భంగా నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు స్పందన కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలతో జిల్లా పోలీసు కార్యాలయం వద్దకు రావొద్దని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించగలరని విజ్ఞప్తి చేశారు. వచ్చే సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు స్పందన కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

25, 26న గొర్విమానుపల్లిలో 'గడప గడప' : ఎంపిడిఒ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల మండలంలోని గొర్విమానుపల్లి గ్రామంలో ఈ నెల 25, 26వ తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జివి ప్రసాద్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బనగానపల్లి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొంటారని చెప్పారు. మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు అందరూ హాజరై గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అమ్మవారి శాలలో దుర్గాదేవి అలంకారంలో దర్శన మిచ్చిన అమ్మవారు

దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు

ప్రజాశక్తి - డోన్

దసరా నవరాత్రులలో భాగంగా 8వ రోజు డోన్ పట్టణంలోని పాతపేటలో ఉన్న అమ్మవారిశాలలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. అమ్మవారిశాలలో అమ్మవారికి ఉదయం కుంకుమార్చన, అభిషేకం, మంగళహారతి, పల్లకి సేవ, హోమాలు నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోట్రికె హరికిషన్, సెక్రటరీ పివి.రంగయ్య, కోశాధికారి చాటకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - నందికొట్కూరు

ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 5 లక్షల 60 వేల రూపాయలు చెక్కులను నలుగురు లబ్ధిదారులకు ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ అందజేశారు. నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరుకి చెందిన నసిరుద్దీన్‌కు రూ. 1 లక్ష 80 వేలు, కురవ కృష్ణవేణికి రూ. 60 వేలు, లింగస్వామికి రూ. 1 లక్ష 20 వేలు, షేక్షావలికి రూ. 2 లక్షలు ఆర్థిక సహాయం మంజూరయినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మద్దూరు హరిసర్వోత్తమ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును విడుదల చేయాలి : టిడిపి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

అక్రమంగా అరెస్టు చేసిన టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును వెంటనే విడుదల చేయాలని టిడిపి మండల ప్రచార కార్యదర్శి కోటపాడు శివరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కొలిమిగుండ్ల మండలం అబ్దుల్లాపురం గ్రామంలో ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ బనగానపల్లె మాజీ శాసన సభ్యులు బిసి జనార్ధన రెడ్డి పిలుపు మేరకు గ్రామంలో ప్రజా వేదిక నిర్వహించినట్లు చెప్పారు. చంద్రబాబు అక్రమ అరెస్టును ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకట్రాంరెడ్డి, అశ్వత్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, భూపాల్, ప్రేమ్, దుర్గాజన్, కిషోర్, రమణ, హరి, శేఖర్, శ్రీనివాసచారి, లక్ష్మీనారాయణమ్మ, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలోని పద్మావతి హైస్కూల్‌లో 2000-2001 సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఇక్కడ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు వివిధ స్థాయిలో ఉన్నవారు అందరూ హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. పాఠశాల డైరెక్టర్ పి.ఆశ ఆధ్వర్యంలో పూర్వపు విద్యార్థులు నాటి ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని ఆమె ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు తమకు విద్యను బోధించిన నాటి ఉపాధ్యాయులు రామారావు, నాగేశ్వరరావు, రవీంద్రనాథ్, మధుర, లక్ష్మీకాంతరెడ్డి, కొత్తపల్లి మండల ఎంఇఒ ఇనాయతుల్లాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం పూర్వ విద్యార్థులు కలుసుకొని తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులకు సన్మానించడంతోపాటు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. 2001 తమ పూర్వపు విద్యార్థులను కలుసుకునే విధంగా కృషి చేసిన పాఠశాల డైరెక్టర్ ఆశాకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులతో నాటి విద్యార్థులు

ఆయుధ పూజ చేస్తున్న చైర్మన్ సప్తశైల రాజేష్

పంపుహౌస్‌లో ఆయుధ పూజ

ప్రజాశక్తి-డోన్ : డోన్ పట్టణంలోని పెరంటాలమ్మ గుడి దగర ఉన్న పంపు హౌస్‌లో ఆయుధ పూజ కార్యక్రమం డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆదివారం నిర్వహించారు. అనంతరం పంప్ హౌస్‌లోని పరిసరాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఈ రసూల్, మున్సిపల్ ఏఈ సురేష్, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్లో ఆయుధ పూజ

కొలిమిగుండ్ల : కొలిమిగుండ్లలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. పోలీస్ స్టేషన్ లో ఉన్న వివిధ రకాల ఆయుధాలకు పేద పండితులు ఆలూరి రాఘవేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ఎస్ఐ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ దసరా నవరాత్రులలో భాగంగా ఆయుధ పూజ సిబ్బందితో కలిసి నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ నరసింహుడు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని కైప గ్రామానికి చెందిన కోగీల సుధాకర్ కుమార్తె కోగీల కీర్తి(17) అదృశ్యమైనట్లు నందివర్గం ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఆదివారం తెలిపారు. కైప గ్రామానికి చెందిన కోగీల సుధాకర్ కుమార్తె కోగీల కీర్తికి ఆరోగ్యం సరిగా ఉండేది కాదని, అప్పుడప్పుడు ఫిట్స్ వచ్చేదని, ఆ బాలిక ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుండి వెళ్లిపోయిందని, చుట్టుపక్కల బంధువుల దగ్గర విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో అమ్మాయి తండ్రి కోగీల సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అదృశ్యమైన బాలిక కీర్తి

మహాగౌరీ దుర్గా అలంకారంలో అమ్మవారు

ప్రజాశక్తి - మహానంది

ప్రముఖ శైవక్షేత్రం మహానంది పుణ్యక్షేత్రంలోని కామేశ్వరి దేవి నవరాత్రి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారు మహాగౌరీ దుర్గా అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆయలంలో నిర్వహించిన చండీయాగం పూజా కార్యక్రమంలో విశేషంగా దాతలు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం రావణబ్రహ్మ వాహనంపై గౌరి దుర్గ అలంకారంలో కామేశ్వరి అమ్మవారిని, ఆలయ ఇఒ కాపు చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి, ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, పండితులు, దాతలు భక్తులు సేవకులు గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాంస్కృతిక కళ ప్రదర్శనలలతో కళాకారులు, మహిళలు, చిన్నారులు నృత్యాలు చేశారు.

దుర్గా దేవి అలంకారంలో కన్యకా పరమేశ్వరి దేవి

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని కొండపేటలో వెలసిన కన్యకా పరమేశ్వరి దేవి దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం దుర్గా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గాదంశెట్టి వేణుగోపాల్, జనరల్ సెక్రటరీ శ్రీరామసుబ్రహ్మణ్యం, ట్రెజరర్ సముద్రాల చక్రపాణి, గౌరవ సలహాదారులు గాదంశెట్టి రవికుమార్, ఉపాధ్యక్షులు నల్లగట్ల శివయ్య, సెక్రటరీ గూండా రవికుమార్, గుండా శ్రీనివాసులు, మింగిమల్ల హనుమాన్ జక్కా నాగరాజు, నల్లగట్ల వెంకటేశ్వర్లు, పిఎస్ఎన్ సత్యం నూకల సుబ్బయ్య, టంగుటూరు శీనయ్య, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాష్టమి వేడుకలు

బనగానపల్లె : మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి దేవస్థానంలో దుర్గాష్టమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా దుర్గాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి చౌడేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహానందిలో చేస్తున్న చండీయాగం

బనగానపల్లె రూరల్ : దుర్గాదేవిగా కన్యకా పరమేశ్వరి దేవి

బనగానపల్లె : చౌడేశ్వరి దేవికి పూజలు నిర్వహిస్తున్న

రాష్ట్రంలో వైసిపి నిర్బంధకాండ : టిడిపి

ప్రజాశక్తి - పాణ్యం

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 30 పోలీస్ ఆక్ట్, 144 సెక్షన్ పేరుతో నిత్యం నిర్బంధ కాండ నడుస్తుండడం చాలా దారుణమని టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి లాయర్ బాబు అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడును ఆక్రమంగా అరెస్ట్ చేసినప్పటి నుండి టిడిపి నాయకులు, కార్యకర్తలు నిరసనలు, ర్యాలీలు చేసుకోకుండా, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఉనికి లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే ఇలాంటి సెక్షన్లు అడ్డుపెట్టుకొని అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టు అయినప్పుడు రాష్ట్రంలో ఎలాంటి హింసాత్మక సంఘటన జరగలేదని చెప్పారు. రాజమండ్రిలో ఉన్న నారా భువనేశ్వరి కలిసి సంఘీభావం తెలపకుండా వివిధ సెక్షన్లతో అడ్డుకోవడం రాజ్యాంగ హక్కులను ఖూనీ చేయడమే అవుతుందన్నారు. శాంతియుత నిరసనలు, ర్యాలీలు చేసుకోవడం ప్రజాస్వామ్యం కల్పించిన హక్కు అన్నారు. ప్రజలు ఓట్లు వేసి ఎన్నుకున్న ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నప్పుడు నిరసనలు తెలిపే హక్కు ప్రజలకు రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను రాష్ట్రప్రభుత్వం కాలరాస్తుందన్నారు. రాష్ట్రంలో టిడిపి నాయకులను, కార్యకర్తలను ఇలాంటి సెక్షన్లు ప్రయోగించి అడుగు అడుగునా అడ్డుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నడుస్తుందా లేదా నియంత పరిపాలన నడుస్తుందా అనేది ప్రజలు గమనించాలన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు లేని విధంగా ఇలాంటి చట్టాలను, సెక్షన్లను అడ్డుపెట్టుకొని పరిపాలన చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిగా పరిపాలన చేసే ప్రభుత్వాలను ప్రజలు స్వాగతిస్తారని తెలిపారు.

వెండి నాగపడగ వితరణ

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం కొత్తూరు సుబ్బారాయుడు స్వామికి కోడుమూరు మండలం పాల్వకుర్తి గ్రామానికి చెందిన సిరిబాబు, గుణవతి దంపతులు 1 కేజీ 19 గ్రాముల వెండి నాగ పడగను ఆదివారం వితరణగా ఇచ్చారు. అలాగే తెలంగాణ మాజీ మంత్రి డికె అరుణ స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఇఒ రామకృష్ణ, సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణ స్వామి, సురేష్ శర్మలు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పేద విద్యార్థినికి చేయూత

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1994-95 పదవ తరగతి పూర్వ విద్యార్థులందరూ కలసి పాఠశాలలో పదో తరగతి -2023 ఫలితాలలో టాపర్‌గా నిలిచిన పేద విద్యార్థినికె.తులసికి ఆదివారం ఆర్థికతోడ్పాటును అందించారు. పాఠశాల సహాయకులు మహబూబ్ బాషా, ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఎంఇఒ నాగేశ్వరరావులు హాజరై వారి చేతుల మీదుగా రూ. 10 వేలు నగదు, మోమెంటోతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సాజిద్ బాషా, రఫిక్, నాగరాజు, నబి రసూల్, షేక్షావలి, టపాల్ రోషన్ వలి, ఖాదర్ వలీ, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.